AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in
20-9-2025 (Saturday)
MAIN EDITION

## భారత రేటింగ్‌ను పెంచిన జపాన్ సంస్థ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** భారత దీర్ఘ కాలిక సార్వభౌమ రుణ రేటింగ్‌ను 'బీబీబీ' నుంచి 'బీబీబీ+'కు పెంచింది. ఈ మేరకు జపాన్ సంస్థ రేటింగ్ ఇన్వెస్ట్ మెంట్ ఇన్ఫర్మేషన్ (ఆర్ అండ్ ఐ) ఓ ప్రకటన చేసింది. మన దేశ ఆర్థిక వ్యవస్థ భవిష్యత్ అంచనాను 'స్థిరం'గా కొనసాగించింది. ఈ ఏడాదిలో భారత్ రేటింగ్‌ను పెంచిన మూడో సార్వభౌమ రుణ రేటింగ్ సంస్థగా ఆర్అండ్ఐ నిలిచింది. అమెరికాకు చెందిన ఎస్అండ్‌పీ సైతం భారత రేటింగ్‌ను పెంచిన విషయం తెలిసిందే.

## రేపటి నుంచి బతుకమ్మ సంబరాలు



**అక్షరటుడే, హైదరాబాద్ :** బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు ప్రతీక. ఇది తొమ్మిది రోజుల ఉత్సవం. ఏటా మహాలయ అమావాస్య రోజున ఎంగిలిపూల బతుకమ్మతో మొదలై.. దుర్గాష్టమిన సద్దుల బతుకమ్మతో సంబురాలు ముగుస్తాయి. తెలంగాణకు ప్రత్యేకమైన పండుగ బతుకమ్మ. ఈ ఏడాది ఆదివారం పండుగ ప్రారంభమవుతుంది. 30వ తేదీన ముగుస్తుంది.

## ఎయిర్‌పోర్టులో గంజాయి పట్టివేత



అక్షరటుడే, హైదరాబాద్: శంషాబాద్ ఎయిర్‌పోర్టులో డ్రగ్స్ పట్టుబడ్డాయి. రూ. 12 కోట్ల విలువ చేసే గంజాయిని అధికారులు సీజ్ చేశారు. దుబాయ్ నుంచి హైదరాబాద్ వచ్చిన ప్రయాణికురాలి వద్ద గుర్తించారు. ఓ మహిళ బ్యాగు తనిఖీ చేయగా భారీ ఎత్తున గంజాయిన కనిపించింది. దీంతో ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

## ఆస్కార్ రేసులో భారత్ నుంచి ఎంట్రీలు



అక్షరటుడే, సినిమా డెస్క్: ఆస్కార్ 2026కు భారత్ నుంచి పోటీ పడే సినిమాల జాబితాను ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా తాజాగా ప్రకటించింది. హిందీ చిత్రం హోమ్‌బౌండ్ ఇంటర్నేషనల్ ఫీచర్ ఫిల్మ్ కేటగిరీలో అధికారిక ఎంట్రీగా ఎంపికైంది. ఇక తెలుగు ఫిల్మ్ ఇండస్ట్రీ నుంచి మొత్తం ఐదు సినిమాలు ఈసారి ఆస్కార్ రేసులోకి వెళ్లబోతున్నాయి.

## రేపటి నుంచి స్కూళ్లకు సెలవులు



అక్షరటుడే, హైదరాబాద్: రాష్ట్రంలోని పాఠశాలలకు ఆదివారం నుంచి దసరా సెలవులు ప్రారంభం కానున్నాయి. ఈ సెలవులు అక్టోబర్ 3వ తేదీ వరకు కొనసాగుతాయి. ఈ మేరకు ఇప్పటికే విద్యాశాఖ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా.. జూనియర్ కాలేజీలకు ఈ నెల 28 నుంచి అక్టోబర్ 6వ తేదీ వరకు సెలవులు ఉండనున్నాయి.

## తాగిన మత్తులో పాము తల కొరికిన వ్యక్తి

**అక్షరటుడే, తిరుపతి :** మద్యం మత్తులో ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు ఓ యువకుడు. విషపూరిత పాముకాటు గురైనప్పటికీ, ఆగ్రహంతో పామును తల ను కొరికి చంపిన ఘటన ఏపీలోని తిరుపతి జిల్లా చియ్యవరం గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేశ్ మద్యం తాగి ఇంటికి తిరిగి వస్తుండగా కట్ల పాము కాటు వేసింది. దీంతో కోపంతో పామును వెంబడించి పట్టుకుని దానిని కొరికి చంపేశాడు. అనంతరం ఇంటికి వచ్చి నిద్రించగా తీవ్ర అస్వస్థతకు లోనయ్యాడు. దీంతో కుటుంబీకులు అతడిని ఆస్పత్రికి తరలించారు. తిరుపతి రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



## షిర్డీ సాయి భక్తులకు గుడ్‌న్యూస్..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** వివిధ క్షేత్రాలను సందర్శించే భక్తుల కోసం ఐఆర్‌సీటీసీ ప్రత్యేక ప్యాకేజీలు తీసుకొస్తోంది. భారత్ గౌరవ్ యాత్ర పేరిట ఐఆర్‌సీటీసీ ఇప్పటికే పలు పుణ్య క్షేత్రాలను దర్శించే అవకాశం కల్పిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా షిర్డీ సాయి భక్తుల కోసం సూపర్ ఆఫర్ ప్రవేశ పెట్టింది. రెండు రోజుల్లో షిర్డీ టూర్‌ను పూర్తి చేసే అవకాశం కల్పిస్తోంది. సాయి సన్నిధి పేరిట ఈ టూర్‌ను తీసుకు వచ్చింది. ఈ యాత్రకు వెళ్లాలనుకునే భక్తులు సెప్టెంబర్ 24 నుంచి నవంబర్ 12 వరకు టికెట్లు బుక్ చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు.

## జమ్మూ కశ్మీర్‌లో ఎదురుకాల్పులు..



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** జమ్మూ కశ్మీర్‌లోని ఉధంపూర్ జిల్లాలో భద్రతా బలగాలు, ఉగ్రవాదుల మధ్య తీవ్ర ఎదురు కాల్పులు చోటుచేసుకున్నాయి. ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్‌కు చెందిన ముగ్గురు లేదా నలుగురు ఉగ్రవాదులు ఈ ప్రాంతంలో ఉన్నట్టు సమాచారం. భద్రతా బలగాలు వీరిని చుట్టుముట్టిన నేపథ్యంలో ఉగ్రవాదులు కాల్పులు ప్రారంభించడంతో ఒక ఆర్మీ జవాన్ తీవ్రంగా గాయపడ్డాడు. నిఘా వర్గాల నుంచి అందిన సమాచారం మేరకు, ఉధంపూర్ జిల్లాలోని దుడు బసంత్‌గఢ్ ప్రాంతంలో ఉగ్రవాదులు తలదాచుకుని ఉన్నట్లు గుర్తించారు. స్పెషల్ ఆపరేషన్ గ్రూప్, జమ్మూ కశ్మీర్ పోలీసులు సంయుక్తంగా భారీ గాలింపు చర్యలు చేపట్టారు.

**రాష్ట్రంలో త్వరలో నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తామని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు పనిగట్టుకుని విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు చేపట్టి ఇటీవల ఏడాది పూర్తికావడంతో పాటు తాజా రాజకీయాల నేపథ్యంలో 'అక్షరటుడే'తో ఆయన పలు విషయాలు పంచుకున్నారు.** **-అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# త్వరలో.. నామినేటెడ్ పోస్టులు

- **బీసీ రిజర్వేషన్లు తేలాకే స్థానిక ఎన్నికలు**
- **కేంద్రం తీరుతోనే యూరియా కొరత**
- **జూబ్లీహిల్స్‌లో గెలుపు మాదే..**
- **'అక్షరటుడే'తో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్**

### నామినేటెడ్ పదవుల్లో సీనియర్లకు ప్రాధాన్యం

నామినేటెడ్ పదవుల భర్తీ విషయంపై పీసీసీ చీఫ్ స్పందిస్తూ.. 'పదవుల కోసం పార్టీలో అసంతృప్తి ఉంది వాస్తవమే. దీంతో కొంచెం గ్యాప్ ఏర్పడుతోంది. నవంబర్ చివరిలోపు నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తాం. సీనియర్లకు ప్రాధాన్యత ఇస్తాం. ఏళ్లుగా పార్టీ కోసం కష్టపడ్డ వారికి పదవులు దక్కుతాయి. కొత్త వారిని ప్రోత్సహించేందుకు 20 శాతం పదవులు వారికి కూడా ఇస్తాం. పదవులు రాని వారు నిరుత్సాహ పడకుండా పార్టీ కోసం పని చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుంది.'

బీసీ డిక్లరేషన్ హామీ మేరకు రిజర్వేషన్లు తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. 'బిల్లులు అసెంబ్లీలో ఆమోదించాం. అయితే అవి కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్నాయి. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు తీర్పు ఈ నెలాఖరు వరకు రానుంది. బీసీ రిజర్వేషన్లు అమలయ్యాకే స్థానిక ఎన్నికలు నిర్వహిస్తాం. సుప్రీం తీర్పునకు అనుగుణంగా ఎన్నికలు నిర్వహించే అవకాశం ఉంది. బీసీ రిజర్వేషన్ బిల్లుకు చట్టబద్ధత కల్పిస్తాం. బీసీలకు న్యాయం జరిగేలా చూస్తాం. ఆ తర్వాతే ఎన్నికలకు వెళ్తాం.' అని తెలిపారు.

### 75 వేల ఉద్యోగాలు భర్తీ

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీలను అమలు చేస్తున్నాం. అధికారంలోకి వచ్చిన 15 నెలల్లోనే 75 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. నేను పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టాక పార్టీలోనూ పలు కీలక మార్పులు తీసుకు వచ్చాం. మంత్రులు కూడా గాంధీ భవన్‌లో కూర్చొని కార్యకర్తల నుంచి వినతులు స్వీకరించే పద్ధతి ప్రవేశపెట్టాం.

### బీసీలకే జూబ్లీహిల్స్ టికెట్!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుంది. గెలుపే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. త్వరలోనే అభ్యర్థిని ప్రకటిస్తాం. దేశంలోనే అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ ఒకటి. మేము అధికారంలోకి వచ్చాక హైదరాబాద్ రూపురేఖలు మార్చేశాం. కాబట్టి జూబ్లీహిల్స్‌లో కచ్చితంగా గెలుస్తాం. అభ్యర్థి ఎవరనేదానిపై సమాలోచనలు జరుగుతున్నాయి. బీసీలకు టికెట్ ఇచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

### కేంద్ర మంత్రులు సమాధానం చెప్పాలి

యూరియా సరఫరా కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుంది. కేంద్రం పంపిన యూరియాను రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అందిస్తుంది. కేంద్రం నుంచి సరిపడా యూరియా రాకపోవడంతోనే కొరత ఏర్పడింది. దీనిపై కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సమాధానం చెప్పాలి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి లోపం లేదు. కావాలనే మా ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారు.

### రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగతం

మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వంపై వరుసగా విమర్శలు చేస్తున్న విషయం తెలిసిందే. దీనిపై మహేశ్ గౌడ్ స్పందిస్తూ.. 'కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలు వ్యక్తిగతమైనవి. మంత్రి పదవి రాలేదనే అసంతృప్తితో ఆయన మాట్లాడుతున్నట్లు ఉన్నారు. ఆయనతో మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నాం. పార్టీకి వ్యతిరేకంగా ఎవరు వ్యవహరించినా తప్పకుండా చర్యలుంటాయి' అని మహేశ్ కుమార్ గౌడ్ తెలిపారు.

## ఆల్మట్టి ఎత్తు పెంచితే తెలంగాణకు తీవ్ర నష్టం : కవిత



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు పెంచితే తెలంగాణ ప్రాంతానికి తీవ్ర నష్టం జరుగుతుందని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కృష్ణా నదిపై గల ఆల్మట్టి డ్యాం ఎత్తు పెంచడానికి కర్ణాటక ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. దీనిపై మహారాష్ట్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పిందని పేర్కొన్నారు. ఆల్మట్టి ఎత్తు పెంచితే తెలంగాణలో కృష్ణనదికి వరద రాదన్నారు. దీంతో ఈ ప్రాంత ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్మట్టి ఎత్తు పెంచకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కవిత డిమాండ్ చేశారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్ కోసం రేవంత్‌రెడ్డి నిధులు కేటాయించడం లేదన్నారు. కనీసం ఆల్మట్టి ఎత్తు పెంచకుండా ఆపి ఉమ్మడి మహబూబ్‌నగర్ ప్రజలకు మేలు చేయాలని కోరారు.

### సుప్రీంకోర్టుకు వెళ్లాలి

ఆల్మట్టి ఎత్తు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు వెళ్లాలని కవిత డిమాండ్ చేశారు. అనవసర విషయాల కోసం సుప్రీంకోర్టుకు వెళ్లే సీఎం, రైతుల గురించి ఎందుకు వెళ్లడం లేదని ప్రశ్నించారు. కృష్ణా జలాల కోసం జాగృతి ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. గోదావరి జలాలను బనకచర్ల పేరుతో చంద్రబాబు నాయుడు దోచుకు వెళ్తున్నారని ఆరోపించారు.

## భారత్ స్టార్ ఆల్‌రౌండర్‌కు గాయం..



**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** ఆసియాకప్ 2025లో భారత జట్టు విజృంభిస్తోంది. వరుసగా మూడు విజయాలతో గ్రూప్-ఏ టాపర్‌గా నిలిచిన టీమిండియా, సూపర్-4లో అడుగుపెట్టింది. శుక్రవారం అబుదాబిలో జరిగిన మ్యాచ్‌లో భారత జట్టు ఒమన్‌పై 21 పరుగుల తేడాతో గెలిచి అదరగొట్టింది. అయితే, పాక్‌తో ఆదివారం జరగనున్న హైఓల్టేజ్ మ్యాచ్‌కు ముందు భారత్‌కు షాక్ తగిలింది. ఒమన్‌తో మ్యాచ్ సమయంలో ఫీల్డింగ్ చేస్తూ టీమిండియా స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ గాయపడ్డాడు. శివమ్ దూబే వేసిన ఓవర్‌లో ఓ క్యాచ్ అందుకునే ప్రయత్నంలో అతడి తల నేల తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ తర్వాత అక్షర్ మైదానం విడిచి వెళ్లాడు. అక్షర్ గాయంపై మ్యాచ్ అనంతరం విలేకరుల సమావేశంలో ఫీల్డింగ్ కోచ్ తిలక్ దిలీప్ స్పందిస్తూ.. "అతడు ప్రస్తుతం బాగానే ఉన్నాడు. కానీ, పూర్తి విశ్వాసంతో పాక్‌తో జరిగే మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడా అన్నది చెప్పలేం" అని అన్నారు.

## హెచ్1బీ వీసా ఫీజు లక్ష డాలర్లకు పెంపు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రోజుకో బాంబు పేలుస్తున్నారు. తాజాగా అమెరికాలోని విదేశీయులపై ట్రంప్ మరో పిడుగు వేశారు. హెచ్ 1బీ వీసా కొత్త నిబంధనలను ప్రకటించారు. వీసా దరఖాస్తు ఫీజును ఏకంగా లక్ష డాలర్లకు పెంచారు. ట్రంప్ తాజా నిర్ణయంతో అమెరికాలోని విదేశీయులు, ముఖ్యంగా భారతీయులు తీవ్ర ఇబ్బంది పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

## విదేశాలపై ఆధారపడడమే ప్రధాన శత్రువు: మోదీ



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ప్రధాని నరేంద్ర మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. గుజరాత్‌లో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడుతూ మనకు శత్రువులు ఎవరూ లేరని, కానీ.. విదేశాలపై ఆధారపడడమే మన ప్రధాన శత్రువు అని వ్యాఖ్యానించారు. హెచ్ 1బీ వీసాల దరఖాస్తు రుసుమును అమెరికా లక్ష డాలర్లకు పెంచిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో మోదీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ''భారత్ ''విశ్వబంధు'' స్ఫూర్తితో ముందుకుసాగుతోందని మోదీ అన్నారు. మన అతిపెద్ద శత్రువు ఇతరదేశాలపై ఆధారపడడమే. విదేశాలపై ఎక్కువగా ఆధారపడితే.. దేశ అభివృద్ధి విఫలమవుతుంది. అత్యధిక జనాభా కలిగిన దేశం ఆత్మనిర్భర్‌గా మారాలి'' అని మోదీ పేర్కొన్నారు.

## ఫిట్‌నెస్ సీక్రెట్ బయటపెట్టిన రష్మిక



ఒకప్పుడు సినీ పరిశ్రమలో హీరోయిన్లు కొంచెం బొద్దుగా ఉంటేనే అందంగా భావించేవారు. కానీ ఇప్పుడు జీరో సైజ్, బాడీ ఫిట్‌గా ఉన్న హీరోయిన్లకే ఎక్కువ ప్రాధాన్యత లభిస్తోంది. అందుకే టాలీవుడ్, బాలీవుడ్ నటీమణులు ఫిట్‌గా ఉండేందుకు విపరీతంగా కృషి చేస్తున్నారు. అందులో భాగంగానే నేషనల్ క్రష్ రష్మిక మందన్న తన ఫిట్‌నెస్ రహస్యాన్ని బయటపెట్టింది. 29 ఏళ్ల వయసులో ఉన్న రష్మికను అభిమానులు ఇప్పటికీ 16 ఏళ్ల కుర్రదానిలా కనిపిస్తోందని కామెంట్ చేస్తున్నారు. ఆమె ఇంత యంగ్, ఫిట్‌గా ఉండడానికి కారణమేంటో స్వయంగా చెప్పింది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో రష్మిక మాట్లాడుతూ.. ''ప్రతిరోజూ ఉదయం లేవగానే ఒక లీటర్ నీళ్లు తాగుతాను. ఆపిల్ సైడర్ వెనిగర్ తీసుకుంటాను. నేను పూర్తిగా వెజిటేరియన్‌గా మారిపోయాను, ఇక మాంసాహారం తినను. అన్నం కూడా ఎక్కువగా తినను. టమాటో, బంగాళ దుంపలతో అలర్జీ ఉండడం వల్ల వాటిని పూర్తిగా మానేశాను. అలాగే ప్రతిరోజు సాయంత్రం తప్పనిసరిగా వ్యాయామం చేస్తాను" అని వెల్లడించింది.

**–అక్షరటుడే, సినిమా డెస్క్**